క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ఆదిమూలం పర్యటన

నారాయణవనం: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం మండలంలో పర్యటిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. భీమునిచెరువులో ఉదయం 8.30 గంటలకు జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

నాగలాపురం: మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ సింధూ శ్యామ్ తెలిపారు. ఎంపీడీఓ కార్యలయంలో శుక్రవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. గత సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు తీసుకున్న చర్యలను వివరించారు. ఎంపీడీఓ పీకేఎం బాబు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ను విజయవంతం చేయాలన్నారు. తహసీల్దార్ ప్రసన్న కుమార్, సింగిల్‌విండో చైర్మన్ అపరంజిరాజు, సర్పంచ్ సుధ, జెడ్పీటీసీ సభ్యుడు మహేష్ రెడ్డి, వైస్ ఎంపీపీలు కుమారి, జాయిస్ ధానవేలు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్నిశాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

పాపానాయుడుపేటలో అన్నదానం



ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట మొదటి వార్డులో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శుక్రవారం నిమజ్జనం చేశారు. ఉదయం వినాయక విగ్రహానికి విశేషాలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 1000 మందికి అన్నదానం చేశారు. సాయంత్రం విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకు వెళ్లి సమీప చెరువులో నిమజ్జనం చేశారు.

నాగలాపురం బస్టాండ్‌లో మృతదేహం

నాగలాపురం: నాగలాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో 80 ఏళ్ల ఓ అనాథ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. అతని వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. మృతదేహాన్ని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ఖననానికి తరలించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ సుధీర్ రెడ్డి హెచ్చరించారు. తొట్టంబేడు పంచాయతీ రామచంద్రాపురం 90–1 సర్వే నంబర్‌లో 1.48 సెంట్ల ప్రభుత్వం ఉంది. దీనిపై కోర్టులో వివాదం నడుస్తోంది. కోర్టు వివాదంలో ఉన్న భూమిని కొందరు ఆక్రమించడానికి ప్రయత్నించగా శుక్రవారం రెవెన్యూ అధికారులు సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించనున్నామని, ఆక్రమించాలని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యా సామగ్రి వితరణ



శ్రీకాళహస్తి: మండలంలోని వివిధ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు షేర్ జీసెస్ వరల్డ్ మినిస్ట్రీస్ సంస్థ అధ్యక్షుడు జోసెఫ్, సుందరరాజు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంకటరత్నం విద్యాసామగ్రిని వితరణగా అందజేశారు. తొండమనాడు హరిజనవాడ, అమ్మపాళెం హరిజనవాడ, చుక్కలనిడిగల్లు యానాదికాలనీ తదితర పాఠశాలల్లో సుమారు 250 మంది విద్యార్థులకు రూ.75వేలు విలువ చేసే విద్యాసామాగ్రిని అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సుచరిత, బాలశైలజ, జయచంద్రా రెడ్డి, రాధిక, ప్రగతి ట్రస్టు కోఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి గోశాలకు ఆవు దానం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం గోశాలకు చెన్నైకు చెందిన అరుణ్‌కుమార్ దంపతులు శుక్రవారం గోవును దానంగా అందజేశారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వారు గో సరంక్షణకు రూ.10వేలు విరాళంగా అందజేశారు. దాతలకు శ్రీస్వామి,అమ్మవార్ల ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

జగనన్నతోనే ఇంటింటా సంక్షేమం

- గడప గడపలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- తామంతా జగనన్న వెంటే అన్న రేణిగుంట వాసులు



రేణిగుంట పాంచాలినగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మధు

రేణిగుంట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి నిరుపేద గడపకు సంక్షేమ ఫలాలు తలుపు తడుతున్నాయని, తద్వారా పేదల జీవనప్రమాణ స్థాయి మెరుగుపడిందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆయన రేణిగుంట పట్టణం పాంచాలినగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. పథకాల లబ్ధి వివరాలు, సమస్యలు తెలుసుకున్నారు. తొలుత ఆయనకు పార్టీ శ్రేణులు గజమాలతో సత్కరించారు. మహిళలు కర్పూర హారతులు పట్టారు. డప్పు,వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల సందడి నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన వర్షం కురుస్తున్నా ఇంటింటికీ వెళ్లి నవరత్న పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ప్రతి ఇంటా ఆయనను సాదరంగా ఆహ్వానించి జగనన్న పాలనలో పథకాలు నేరుగా ఇంటికే చేరుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. సంక్షేమ ప్రదాత జగనన్నకు వచ్చే ఎన్నికల్లో తోడుగా నిలిచి మరోసారి గెలిపించుకుంటామని ఎమ్మెల్యేకు మాటిచ్చారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాల చేత పథకాల లబ్ధి అందకుండా ఉంటే వారి ఫిర్యాదులను ప్రత్యేకంగా స్వీకరించి, సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ముడుపులు తీసుకుని అడ్డంగా దొరికిపోయి జైలుపాలైతే టీడీపీ నాయకులు కట్టుకథలతో ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్న చర్యలను ప్రజలు ఏవగించుకుంటున్నారని పేర్కొన్నారు. ఎంత మంది ఒక్కటైనా రానున్న ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాల ప్రజలే జగనన్నను మరోసారి గెలిపించుకుంటారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, గంగారి రమేష్, జువ్వల దయాకర్‌రెడ్డి, మన్యం శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, రసూల్, ఖదీర్, రఫీవుల్లా, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మల్లిరెడ్డి, వెంకటరమణ, ఎంపీటీసీ వెంకటసుబ్బమ్మ, శ్రావణి, ఈశ్వరి, కృష్ణమూర్తి, ఇరానీ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటు లక్షణాలపై అవగాహన



మాట్లాడుతున్న రవీంద్ర

వరదయ్యపాళెం: గుండెపోటు లక్షణాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్‌ఈఓ రవీంద్ర సూచించారు. ఇరుగుళం హైస్కూల్‌లో ప్రపంచ హృదయ దినోత్సవాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మోండలెజ్ బాలరక్షా భారత్ సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుతున్న సమాజంలో బీపీ, షుగర్ వంటివి గుండెపోటుకు ప్రధానమైన కారణాలు అని వివరించారు. ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా యోగా, నడక, వ్యాయామం చేపట్టాలన్నారు. హెచ్‌ఎం మోహిద్దీన్, ఉపాధ్యాయుడు మధు, సంస్థ కో–ఆర్డినేటర్ హేమంత్, సూపర్‌వైజర్ రాజేష్ పాల్గొన్నారు.

శరవేగంగా భూముల రీసర్వే

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరు గ్రామ రెవెన్యూలో వైఎస్సార్ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద భూముల రీసర్వే శరవేగంగా జరుగుతోందని తహసీల్దారు భార్గవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఇందుకోసం భూములకు సంబంధించిన రికార్డులను పక్కాగా సిద్ధం చేసినట్లు తెలిపారు. వంద సంవత్సరాల తర్వాత గ్రామీణ, పట్టణ, ప్రాంతాల్లో వ్యవసాయ, గ్రామకంఠం స్థిరాస్తుల సర్వే జరుగుతుందన్నారు. భూముల రీ సర్వేలో అన్ రిజిస్టర్, వంశపారంపర్యం భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తారని పేర్కొన్నారు. కంచనపుత్తూరు గ్రామ రెవెన్యూలో 2,200 ఎకరాల భూమి ఉందని, అందులో 700 ఎకరాల సర్వే పూర్తయినట్లు వివరించారు.

ఘనంగా జాషువా జయంతి



శ్రీకాళహస్తి: పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజశేఖర్ మాట్లాడుతూ గుర్రం జాషువా రచనలు, వారి ఆవేదన, రచనల్లోని అంతర్యాన్ని విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు వెంకటేష్, నరసింహారావు, మాలతి గాబ్రియేల్, శ్రీకాంత్‌రెడ్డి, శైలజ, ఉష, సుమతి, వైష్ణవి, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు

ఉత్సాహంగా రన్ శ్రీకాళహస్తి రన్



రన్ ప్రారంభిస్తున్న ఆర్డీఓ రామారావు

శ్రీకాళహస్తి: పట్టణంలో ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రన్ శ్రీకాళహస్తి రన్(3కే రన్) శుక్రవారం ఉత్సాహంగా సాగింది. ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ ఆధ్వర్యంలో ఆస్పత్రి వద్ద శుక్రవారం ఆర్డీవో రామారావు, కమిషనర్ రమేష్‌బాబు, ఎమ్మెల్యే కుమారుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి రన్ ప్రారంభించారు. సుమారు 350 మంది పాల్గొన్నారు.

మైక్ సెట్ వితరణ



రేణిగుంట: మండలంలోని వెంకటాపురం పంచాయతీ ఆర్.అగ్రహారం ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు సందీప్‌రెడ్డి మైక్‌సెట్ వితరణగా అందజేశారు. హెచ్‌ఎం శివకుమార్‌కు దీన్ని అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షులను నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.

శ్రీకాళహస్తి నియోజకవర్గం

ఏర్పేడు	రమణయ్య యాదవ్
తొట్టంబేడు	కె.శంకరయ్య
శ్రీకాళహస్తి	వి.కృష్ణారెడ్డి
రేణిగుంట	గంగారి రమేష్
మున్సిపాలిటీ	పగడాల రాజు

సత్యవేడు నియోజకవర్గం

బుచ్చినాయుడు కండ్రిగ	విద్యానాథరెడ్డి
కేవీబీ పురం	కృష్ణయ్య
నాగలాపురం	అపరంజి రాజు
పిచ్చాటూరు	కొండూరు వెంకట చలపతి రాజు
సత్యవేడు	సుశీల్ కుమార్ రెడ్డి
వరదయ్యపాళెం	దయాకర్‌రెడ్డి

దేశభక్తిని పెంపొందించుకోవాలి



సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ



సత్యవేడు : దళవాయి అగ్రహారంలో ర్యాలీ



ఏర్పేడులో ర్యాలీ



సంతవేలూరులో ర్యాలీ



రేణిగుంట భారత్ ఆకృతిలో మానవహారం

సత్యవేడు: చిన్నతనం నుంచి ప్రతి ఒక్కరూ దేశానికి మనం ఏమి చేయగలమో ఆలోచించాలని హెచ్‌ఎంలు భారతి, వి.వాణి అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమంలో భాగంగా 'నాభూమి– నాదేశం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ నాయకుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సత్యవేడు, దళవాయి అగ్రహారంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు తమ ఇంటి సమీపం నుంచి తీసుకువచ్చిన మట్టిని ఉపాధ్యాయులు సేకరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తల్లిదండ్రులు, సొంత ఊరు, దేశానికి, మన కోసం ప్రాణాలు అర్పించిన త్యాగమూర్తులకు రుణపడి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగలాపురం: మండలంలోని కారణి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం నా భూమి– నాదేశం ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషాధారణతో విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.హెచ్‌ఎం జయకుమారి, పీడీ గంటధాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్యాగధనుల వీరభూమి భారతదేశం

ఏర్పేడు: త్యాగధనుల వీరభూమి భారతదేశమని ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని పాతవీరాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నాదేశం కార్యక్రమం జరిగింది. త్యాగధనుల చిత్ర పటాలతో విద్యార్థులు భరతమాత వేషధారణలో ర్యాలీ నిర్వహించారు. అలాగే మడిబాకలో సర్పంచ్ చెంగల్రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు దేవరాజులు, పద్మజ, వెంకటేశ్వర్లు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

దేశ ఔన్నత్యాన్ని భావితరాలకు చాటాలి

వరదయ్యపాళెం: అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్న భారతదేశ ఔన్నత్యాన్ని భావితరాలకు చాటి చెప్పాలని సంతవేలూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాధవయ్య తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మన మట్టి–మన దేశం నినాదంతో విద్యార్థులు వివిధ వేషధారణలతో సంతవేలూరు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి మట్టిని సేకరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు నా భూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు అమృతకలశ యాత్రను చేపట్టారు. భారతదేశ ఆకృతిలో విద్యార్థులు కూర్చుని దేశభక్తిని చాటారు. అనంతరం సేకరించిన మట్టిని మండల వనరుల కేంద్రానికి చేర్చారు. ఎంఈవో–2 రంగనాథ్, హెచ్‌ఎం విష్ణువర్ధనం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



వీధి దీపాల స్విచ్‌ను ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండల కేంద్రం నుంచి కసిమిట్ట వరకు ఏర్పాటు చేసిన వీధిదీపాలను శుక్రవారం సాయంత్రం ఆయన స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ట్రాన్స్‌కో రెండు లక్షల అంచనా వ్యయంతో స్తంభాలను, లైన్లను ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యేతోపాటు జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ సొంత నిధులతో ఎల్‌ఈడీ దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ 40 ఏళ్ల కల నేటికి నెరవేరిందని అన్నారు. భీమునిచెరువు, కసిమిట్ట గ్రామాల వారు నారాయణవనం రావాలంటే పొలాల గట్లపైనే వెళ్లేవారని తెలిపారు. తాను భీమునిచెరువు సర్పంచ్‌గా పనిచేస్తున్న కాలం నుంచి రోడ్డు అభివృద్ధితో పాటు వీధి దీపాల ఏర్పాటుకు చేసిన ప్రయత్నాలు నేటికి పూర్తి అయ్యిందని పేర్కొన్నారు. మండల కేంద్రం నుంచి కసిమిట్ట వరకు బీటీ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అందరి సహకారంతో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ వీధి దీపాలను ఎమ్మెల్యే హోదాలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏవో గుణశేఖర్, ట్రాన్స్‌కో ఏఈ జయప్రకాష్‌బాబు, లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, ట్రాన్స్‌కో సిబ్బంది, కసిమిట్ట సర్పంచ్ శశికళ, సచివాలయ కన్వీనర్ ఆర్ముగం, అన్నాదొరై, ఊరప్ప, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి సాయం

సత్యవేడు: మండలంలోని ఇరుగుళం దళితవాడలో శుక్రవారం ఉదయం పూరిల్లు దగ్ధమై కట్టుబట్టలతో నిలచిన దయామణి కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శించి రూ.11వేలు ఆర్థిక సాయం , బియ్యం, పప్పుదినుసులు అందజేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



కుంభాభిషేకం పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆలయాలతో ఆధ్యాత్మికత, ఐక్యత

వరదయ్యపాళెం: ఆలయాలతో ఆధ్యాత్మికత పెరుగుతుందని, ఉత్సవాలు, వేడుకలతో గ్రామాల్లో ఐక్యతాభావం పెంపొందుతుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండలంలోని కడూరు హరిజనవాడలో శుక్రవారం జరిగిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కర కుంభాభిషేకం వేడుకల్లో ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. నిర్వాహకులు పూర్ణకుంభ స్వాగతం పలికి, తీర్థప్రసాదాలను అందజేశారు.ఎమ్మెల్యే వెంట మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, వైఎస్సార్ సీపీ బీఎన్‌కండ్రిగ మండల కన్వీనర్ ఆరణి విద్యానాథరెడ్డి, స్థానిక సర్పంచ్ సుజాత, శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టు బోర్డు మెంబర్ పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, సేవాదళ్ మండల కన్వీనర్ నానిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఐ సేవలు అభినందనీయం

సత్యవేడు: సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తూ బదిలీ అయిన ఎస్‌ఐ పురుషోత్తంరెడ్డి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం సాయంత్రం ఎస్‌ఐ వీడ్కోలు సన్మాన సభలో ఎమ్మెల్యే పాల్గొని సన్మానించారు. ఆయన మాట్లాడుతూ సత్యవేడు, వరదయ్యపాళెం, పిచ్చాటూరు మండలాల్లో పనిచేసిన ఆయన ఫ్రెండ్లీపోలీస్‌గా పేరు తెచ్చుకొన్నారన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, సీఐ శివకుమార్ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే



కాళమనాయుడుపేటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



బుచ్చినాయుడుకండ్రిగ: వెస్టువరత్తూరులో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్

సత్యవేడు: ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే మండలంలో చురుగ్గా సాగుతోంది. శుక్రవారం కాళమనాయుడుపేట, సత్యవేడు, ఇరుగుళం, మదనంబేడు, పీవీపురంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఏఎన్‌ఎంలు, ఎంపీహెచ్‌ఓలు ఆయా కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలు నమోదు చేస్తున్నారు. బీపీ, మధుమేహం, గల్ల, మలేరియా, డెంగీ తదితర పరీక్షలు నిర్వహించి వైద్య శిబిరాలకు టోకెన్లు అందజేస్తున్నారు. వైద్య శిబిరాల్లో నయం కాని జబ్బులకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సౌకర్యం కల్పిస్తామని దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారులు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఓ వరం

బుచ్చినాయుడుకండ్రిగ: జగనన్న ఆరోగ్య సురక్ష ఓవరమని, ఇంటింటా పేదలందరికీ ఉచితంగా మెరుగైన వైద్యం అందుతుందని బుచ్చినాయుడుకండ్రిగ పీహెచ్‌సీ వైద్యాధికారి దివాకర్ అన్నారు. ఆయన శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలోని వెస్టువరత్తూరు, కారణి గ్రామాల్లో సిబ్బందితో కలసి సుమారు 150 కుటుంబాలను సందర్శించి, వారికి వైద్య శిబిరాల టోకెన్‌లు అందజేసి, వలంటీర్లకు, వైద్య సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు.

వైభవంగా పౌర్ణమి పూజలు



విశేషాలంకరణలో శ్రీసారకాయలస్వామి



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

నారాయణవనం: మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం పౌర్ణమి పూజలను వైభవంగా నిర్వహించారు. నారాయణవనంలోని అవధూత శ్రీసారకాయలస్వామి ఆలయంలో ఉదయం మూలవరులకు అభిషేక పూజలు నిర్వహించి, పట్టుపీతాంబరాలు, సుగంధ భరిత పుష్పమాలికతో సుందరంగా అలంకరించారు. తమిళనాడు నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాదాలను వితరణ చేశారు. సింగిరి కోనలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. ప్రతి స్వాతి నక్షత్రం రోజున మహా సుదర్శన యాగాన్ని, పౌర్ణమి రోజున స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీలు గిరిబాబు, భాస్కర్‌బాబు తెలిపారు. ప్రతి రోజు మూడు వేళలా ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదాన సత్రంలో అన్నప్రసాదాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కైలాసనాథకోనలోని కంచి, శివశక్తి ఆశ్రమాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు, పర్యాటకులకు అన్నదానం చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగలో

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్వాకోట ఎస్సీకాలనీలోని శ్రీగంగమ్మ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం అనంతరం విశేషంగా అలంకరించి పూజలు చేశారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి నివేదించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

తిరుపతికి తొలి టర్ఫ్ పిచ్ క్రికెట్ స్టేడియం



పనులను పరిశీలిస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ హరిత

తిరుపతి తుడా: తిరుపతి నగరానికి త్వరలో టర్ఫ్ పిచ్‌తో కూడిన క్రికెట్ స్టేడియం అందుబాటులోకి రానుందని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత తెలిపారు. ఆమె శుక్రవారం గొల్లవానిగుంటలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియాన్ని పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదేశాలతో స్టేడియం నిర్మాణం చేపట్టామన్నారు. దాదాపు పనులు దాదాపు పూర్తయ్యాయని, పెండింగ్ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అలాగే గొల్లవానిగుంట బండ్ పై ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, పెవ్‌మెంట్ పనులను పరిశీలించి రైలింగ్‌కు పెయింటింగ్ చేయించాలని సూచించారు. ఎస్ఈ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ విజయకుమార్ రెడ్డి, ఏఈకామ్ సంస్థ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.